126

# కొత్త ఢిల్లీలో శ్రీశ్రీ షష్టిపూర్తి

"అభ్యుదయపథాన సాగు అద్వితీయ రచనా శ్రీ !!!" అంటూ సాగిన అభినందన పత్రపఠనంతో ప్రారంభమయిన సమావేశం, ఢిల్లీలో తెలుగు సాహిత్యాభిమానులు అంత సులభంగా మరచిపోలేని సమావేశాలలో ఒక్కటి.

తెలుగు దేశానికి వేయిమైళ్ళ దూరాన వుంటూ కూడా తన భాషను, తన సాహిత్యాన్ని సాహితీకారులను మరవని తెలుగువాడు ఇటువంటి ఉత్సవాలలో సమావేశాలలో పాల్గొని తనలోని తెలుగుతనమంతా ఒక్కసారి ఉప్పొంగగా– "ఆహా! ఇదీ నా భాష" అని మురిసిపోతుంటాడు. అటువంటి అవకాశాన్ని ఢిల్లీ "తెలుగు సాహితీ"వారు జనవరి 2వ తేదీ సాయంకాలం కల్పించారు. ఆనాడు వారు ఆధునిక తెలుగు కవితా యుగకర్త శ్రీరంగం శ్రీనివాసరావు షష్టిపూర్తిని ఘనంగా. ఆనందంగా జరుపుకున్నారు.

సమావేశాన్ని ప్రారంభిస్తూ తెలుగుసాహితీ అధ్యక్షులు శ్రీ దామోదరం సంజీవయ్య — "ఆ మూల సౌధాలలో వసించినవారి కథలను వర్ణించిన తెలుగుకవితను నలుగురిమధ్యకు తెచ్చి సామాన్య మానవుడి కష్టాలను స్వప్నాలను గానం చేయించిన విప్లవకర్త శ్రీశ్రీ" అన్నారు. శ్రీశ్రీకి తమ చిన్న కానుకగా ఢిల్లీ "తెలుగు సాహితీ" విశాఖపట్నంలో ఏర్పడిన శ్రీశ్రీ సన్మానసంఘం వారికి 601/- రూపాయలు పంపినట్లుగా ఆయన ప్రకటించారు.

ఆ తర్వాత గోష్ఠి ప్రారంభమయింది. విశాఖపట్నంలో మురికి కూపంగా వున్న నాలుగురోడ్ల కూడలివద్ద నిలవేసి "ఇదిగో, నేనీగేయం రాశాను వింటావూ!" అని శ్రీరంగం శ్రీనివాసరావు అనే కాలేజి యువకుడు చదవగా విన్న శ్రీ మద్దాలి సూర్యప్రకాశరావు ఇలా చెప్పారు.

"ఆనాడు అతడిని Wilde stage లో అనగా అస్కార్ వైల్డ్ ప్రభావంలో ఏదో రాశాడులే అన్నాము.... కాని అతడీనాడొకచైతన్యవంతమైన మహారచయితగా రూపొందడం మా అందరికీ ఆనందంగా వుంది. శ్రీశ్రీ ఉత్తమ కవి, గొప్ప కవి. అంటున్నాము. ఎందుకని....? గొప్ప కవిత్వం అన్నది కాలబద్ధం కాకుండా, విశ్వజనీనంగా వుంటుంది అని అరవిందుడు నిర్వచించాడు. ఆ నిర్వచనానికి నిలబడగలది శ్రీశ్రీ కవిత. అతడి కవిత నర్థం చేసుకోవాలంటే రెండు ప్రపంచ యుద్ధాలమధ్య వాటి అనంతరం ఫ్రాన్స్, జర్మనీ దేశాలలోని చిత్రరచనలను పరిశీలించాలి. తరతరాలుగా విశ్వసించిన విలువలు నిర్దాక్షిణ్యంగా హతమార్చబడుతుంటే, సుస్థిరమనుకున్న పునాదులు కూలి మట్టిలో కలిసిపోతుంటే మనం ఎందుకు, మన బతుకులెందుకు అన్న ప్రశ్నలు ఝుంఝూమారుతాలై ఆయా దేశాల ప్రజల మనసులను కలచివేసిన ఆ ప్రళయకాలపు మానసిక సంఘర్షణను శ్రీశ్రీ కవితలో ప్రతిఫలించింది; యుగధర్మం అందులో ప్రజ్వలించింది. కనుకనే అతడు మన కవి అయినాడు; మహాకవి అయినాడు" అన్నారు.

శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావు ఇట్లా చెప్పారు; శ్రీశ్రీ కవితా కృషి నంతటినీ కలగలిపి పక్షిదృష్టిలో పరిశీలిస్తే- "తెలుగుకవి సంస్కారం విశ్వపరిధిలోకి విస్తరించడమే గాకుండా, వివిధ రాజకీయభావాల వివిధ విదేశ సాహిత్యాల సంపర్కంవల్ల భావసంపదను విస్తృతం చేసుకోవడమే గాకుండా నన్నయ్య నాటినుండీ తనదాకా క్రమపరిణామం పొందుతూ వచ్చిన తెలుగుభాషలో ఆ భావసంపదను సునాయాసంగా ప్రకటించే శక్తిని శ్రీశ్రీ తన కవిత్వంలో సాధించాడు." అన్పిస్తుంది. శ్రీశ్రీ చేతిలో పరిణా

మం పొందిన మానవతావాదం ఇతివృత్తంగాగల గేయకవితకుగాని వచన కవితకు గాని శ్రీశ్రీయే గురువు. శ్రీశ్రీ కేవలం వచన కవితలోకి దిగేదాకా ఆయన కవితలలో పూర్వకవి సమయాలూ, హైందవ సంస్కృతిని నిరూపించే ప్రాచీనభావాలూ విడిచిపెట్టలేదు. అయితే అవి మన కళ్ళకు కట్టేటట్లు చేసే చిత్రాలు కొత్తవి....మహాప్రస్థానం రోజులలో శ్రీశ్రీ కవితలో కేవలం హృదయప్రభావం ఎక్కువగా కనబడుతుంది. తర్వాత తర్వాత ఆయన కవితల్లో హృదయమూ మెదడూ కలిసిపోయినట్లనిపిస్తుంది. ఈ పరిణతమైన కవితలో మహాకావ్య సౌకుమార్యం (Epic simplicity) వుంది.

మతాలను వదలి, కులాలను దాటి, దేశాల నధిగమించి లోకంలోని మానవులందరి దుఃఖాలను, బాధలను. వ్యథాభరిత జీవిత సత్యాలను పరిశీలించి వారి మర్మజలానికి ఖరీదుకట్టే "షరాబు" అవుతూ, జరుగుతున్న అన్యాయాలను, కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలు దౌర్జన్యాలు పరిష్కరించే బహిష్కరించే కవిత వ్రాసి "విశ్వశ్రేయంః కావ్యం" అన్న నిర్వచనాన్ని సార్ధకం చేసిన శ్రీశ్రీ "మహాప్రస్థానం" కావ్యాన్ని సమీక్షించారు శ్రీ రావి నూతల సత్యనారాయణ. తెనుగు సాహిత్య చరిత్రలో ఇటీవలి కాలంలో వీచిన ఝంఝూనిల వీచిక శ్రీశ్రీ" అన్నారు కుందుర్తి" అంటూ శ్రీశ్రీ మీద, ఆయన కవిత్వం మీద సమకాలీన మేధావుల అభిప్రాయాలనుటంకిస్తూ సాగిన శ్రీరామరాజు విద్యా సాగరరావుగారి ప్రసంగంలో శ్రీశ్రీ కవిత్వం మీద శ్రీశ్రీ ఉద్దేశ్యం ఏమిటో వివరించారు.

"....బతికున్న వాళ్ళను వాళ్ళెంతటి మహామహులయినా ఒక పట్టున మెచ్చుకోని, మెచ్చుకోలేని ఇంతమంది తెలుగువాళ్ళం, అందులోనూ రచయితలం మెచ్చుకుంటున్నామంటే శ్రీశ్రీ గీతాలన్నీ "గీత" వలె నేటికి నిత్యనూతనంగా వుండటమే కారణం" అన్నారు శ్రీ వేమరాజు భానుమూర్తి, "ఫాసిల్ పూజా" గుణాన్ని, తెలుగువాడి వెధవాయిత్వాన్ని, అభ్యుదయాన్ని

అడ్డేటిది ఏదయినా దాన్ని చెవులు మెలేయడానికి హాస్యవ్యంగ్యాలను, వాడుకున్న ''మరొక శ్రీశ్రీ గురించి, డజన్‌ల కొలది ''పన్'' లు వేయగల పదాల రారాజు శ్రీశ్రీ'' గురించి వాకాటి పాండురంగారావు ప్రసంగించారు.

గోష్ఠిని సమీక్షిస్తూ ''తెలుగుసాహితి'' ఉపాధ్యక్షులు ఆచార్య గంటి జోగి సోమయాజి - నన్నయ్య నాటి నేటిదాకా తెలుగు కవిత్వం వర్ధిల్లుతూ వచ్చిందనీ, అట్టి కవితా సంపదకు శ్రీశ్రీ ఉత్తమ వారసుడని, అత్యంత ప్రతిభావంతుడైన శ్రీశ్రీని గొప్ప కవిగా అతడి సమకాలికులు గుర్తించడం హర్షదాయకమైన విషయమనీ చెప్పారు.

గోష్ఠి ముగిశాక శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావు, శ్రీమతి వక్కలంకసరళారావులు ''మరో ప్రపంచం'' ''పవిత్రల్లీ'' ''నిజంగానే'' ''చూడు చూడు నీడలు'' ''కవితా'' అన్న శ్రీశ్రీ గేయాలను అద్భుతంగా గానంచేశారు. ముఖ్యంగా శ్రీరజని ''కవితా, ఓ కవితా! గేయాన్ని పాడగా ఆనాడు విన్నవారందరికీ అదొక అనిర్వచనీయమైన అనుభవం.

[23, జనవరి, 1970]